
చురకలు

మంగళవారం 12 మే 2026

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు



**సత్తుపల్లి:** నియోజకవర్గంలోని ఖమ్మం—సత్తుపల్లి జాతీయ రహదారిపై వీఎం బంజర సమీపంలో సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. చిలకలూరిపేట గ్రామానికి చెందిన పి.సుబ్బారావు మామిడికాయల సీజన్ నేపథ్యంలో పనినిమిత్తం వలసగా వచ్చినట్లు తెలిసింది. సోమవారం ఉదయం బైక్లో పెట్రోల్ కొట్టించుకునేందుకు పెట్రోల్ బంక్ వైపు వెళ్తుండగా, వీఎం బంజర నుంచి కల్లూరు వైపు వెళ్తున్న వంగా వెంకటేశ్వరరావు దంపతులు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం వేగంగా వచ్చి సుబ్బారావు వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని చికిత్స నిమిత్తం పెనుబల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా సుబ్బారావు పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం.

## పేదల సొంతింటి కల సాకారం



**ఇచ్చోడ:** ఇందిరమ్మ పథకంతో పేదల సొంతింట కల సాకారమైందని ఆదిలాబాద్ డీసీసీ జిల్లా అధికార ప్రతినిధి, ఆదివాసీ నాయకులు కుంరం కోటేష్ అన్నారు. మండలంలోని కోకస్మన్నూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ గృహప్రవేశ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులతో కలిసి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇచ్చోడ మండల కాంగ్రెస్ అధ్యక్షులు కళ్లెం నారాయణ రెడ్డి, బోథ్ నియోజకవర్గ మైనార్టీ చైర్మన్ ముస్తఫా, సిరికొండ మండల అధ్యక్షులు షేక్ ఇమామ్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు గోవర్ధన్, ఇతర ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటి వివరాలు నమోదు చేయాలి



**భీంపూర్:** మండలంలోని పిప్పల్ కోటి గ్రామంలో రాబోయే జనాభా లెక్కల సేకరణ ప్రక్రియపై అధికారులతో కలిసి గ్రామ సర్పంచ్ దాసరి రమేష్ ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటిని కవర్ చేసేలా పకడ్బందీగా జనగణన నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జనాభా లెక్కల ప్రక్రియలో భాగంగా గ్రామంలో విలేజ్ మ్యాపింగ్ పనులను పర్యవేక్షించారు. గ్రామాన్ని వివిధ బ్లాకులుగా విభజించి, ఏ ఒక్క ఇల్లు, వ్యక్తి వివరాలు మిగలకుండా నమోదు చేయాలని సూచించారు. ఈ విధానంతో సిబ్బందికి పని సులభతరం కావడంతో పాటు పారదర్శకత పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ బానోత్ రమేష్ మాట్లాడుతూ జనాభా లెక్కలు దేశాభివృద్ధికి దిక్సూచి వంటివని, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని కోరారు. క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించే సిబ్బందికి గ్రామస్తుల పూర్తి సహకారం అందేలా అవగాహన కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రోడ్డె నారాయణ, జీపీఓ పంజాబ్ రావు, గ్రామ కార్యదర్శి సతీష్, ఉప సర్పంచ్ మస్కే ప్రవీణ్, వార్డు సభ్యుడు రేణిగుంట్ల శ్రీనివాస్, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# బండి సంజయ్ కుమారుడి వ్యవహారంపై బీజేపీ స్పందించాలి

## డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ డిమాండ్



**ఆసిఫాబాద్:** దేశం కోసం, ధర్మం కోసం అంటూ నీతులు చెప్పే బీజేపీ నాయకులు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథపై వచ్చిన తీవ్రమైన ఆరోపణల విషయంలో ఎందుకు మౌనం పాటిస్తున్నారని కుమురం భీం ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ ప్రశ్నించారు. సోమవారం డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. బండి సంజయ్ కుమారుడు ఒక మైనర్ బాలికను స్నేహం పేరుతో పలుమార్లు ఫామ్ హౌస్‌కు రప్పించి, మత్తు పదార్థాలు ఇచ్చి అత్యాచారానికి పాల్పడ్డారనే ఆరోపణలు అత్యంత విచారకరమని ఆమె పేర్కొన్నారు. ఒక హిందూ బాలికకు ఇంత అన్యాయం జరిగినా, హిందూ ధర్మం గురించి మాట్లాడే బీజేపీ నాయకత్వం ఇంకా స్పందించకపోవడం వారి ద్వంద్వ నీతికి నిదర్శనమని విమర్శించారు. కంచే చేను మేసిన చందంగా, శాంతిభద్రతలను పర్యవేక్షించాల్సిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కుమారుడే ఇలాంటి ఆరోపణలు ఎదుర్కోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. ఈ ఘటనకు బండి సంజయ్ నైతిక బాధ్యత వహించాలని, సమాజం పట్ల గౌరవం ఉంటే వెంటనే ఆయనను మంత్రి పదవి నుండి బర్తరఫ్ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. బండి సంజయ్‌కు నిజంగానే నీతి, నిజాయితీ ఉంటే, విచారణ నిష్పక్షపాతంగా జరిగేలా చూసేందుకు తన ఎంపీ, మంత్రి పదవులకు రాజీనామా చేయాలని సూచించారు. దేశం కోసం రాజకీయాలు చేస్తున్నామని చెప్పుకునే బీజేపీ, ఈ విషయంలో తమ వైఖరిని స్పష్టం చేయాలని సుగుణక్క డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో డీసీసీ వైస్ ప్రెసిడెంట్‌లు ఉబెద్ బిన్ యాహియా (తారిఖ్), కాట్కార్ భీమ్ రావ్, ప్రధాన కార్యదర్శి బుద్దే విజయ్ కుమార్, మాజీ ఎంపీటీసీ సిడాం తిరుపతి, ప్యాక్స్ డైరెక్టర్ దుర్గే కాంతారావు, కాంగ్రెస్ నాయకులు సుజాయిత్ ఖాన్, షేక్ మహమ్మద్, అదే దిలీప్, మనే సంతోష్ కుమార్, సోనులే రమేష్, బొమ్మకంటి కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కళాశాలలో ఘనంగా ప్రజా పాలన వారోత్సవాలు

- **డిజిటల్ బోర్డులను ప్రారంభించిన సర్పంచ్ నీలిమ రవీందర్ రెడ్డి**



**నేరడిగొండ:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన—ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఇంటర్ విద్య ప్రణాళిక వారోత్సవాలు సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాలు ఈనెల 17వ తేదీ వరకు కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ సర్పంచ్ నీలిమ రవీందర్ రెడ్డి కళాశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ఐఎఫ్పీఎస్, ఐడీపీఎస్ డిజిటల్ బోర్డులను ప్రారంభించారు. అనంతరం కళాశాలలో అందుబాటులో ఉన్న వసతులు, విద్యా బోధనకు సంబంధించిన ప్రత్యేక పోస్టర్లు, పాంప్లెట్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వం అందిస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డిజిటల్ బోర్డుల ద్వారా పాఠ్యాంశాలను సులభంగా అర్థం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కళాశాలలో అడ్మిషన్ల సంఖ్య పెరగాలని, విద్యార్థులు ప్రతిరోజూ కళాశాలకు హాజరై అధ్యాపకులు బోధించే పాఠాలను శ్రద్ధగా వినాలని సూచించారు. విద్య ద్వారానే భవిష్యత్తు ఉన్నతంగా తీర్చిదిద్దుకోవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ రవీందర్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ షబాన, అధ్యాపకులు సుభాష్, నాగారావు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 15న ఉట్నూర్లో మెగా జాబ్ డ్రైవ్

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**



**ఆదిలాబాద్:** జిల్లాలోని నిరుద్యోగ యువతకు వివిధ రంగాల్లో ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఈనెల 15న ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో "మెగా జాబ్ డ్రైవ్" నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. సోమవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో మెగా జాబ్ డ్రైవ్కు సంబంధించిన పోస్టర్లను అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం, ఐటిడిఏ ఉట్నూర్ సహకారంతో మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ ఉపాధి మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ జాబ్ డ్రైవ్లో టెక్ మహీంద్రా, హెటెరో, అపోలో ఫార్మసీ, ముత్తూట్ ఫైనాన్స్, స్ట్రాటెక్ తదితర సుమారు 20కి పైగా ప్రముఖ సంస్థలు పాల్గొంటున్నాయని తెలిపారు. ఫైనాన్స్, మార్కెటింగ్, హెచ్ఆర్, ఫార్మసీ తదితర విభాగాల్లో వందలాది ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయనున్నట్లు చెప్పారు. ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ అవకాశానికి అర్హులని తెలిపారు. ఎంపికైన వారికి స్థానిక ప్రాంతాలతో పాటు ఇతర ప్రధాన నగరాల్లో కూడా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 15న ఉదయం 10 గంటలకు తమ విద్యార్హత ధ్రువపత్రాలతో ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు హాజరుకావాలని సూచించారు. ఏజెన్సీ ప్రాంత యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉపాధి పొందాలని కోరారు. ఇతర వివరాలకు సెల్: 9989717139, 9494559027, 9553141962 నంబర్లపై సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రతాప్ సింగ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# జనగణనలో అందరు భాగస్వాములు కావాలి

- **సెన్సస్ వాక్ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ రాజర్షిషా**




**ఆదిలాబాద్:** వికసిత్ భారత్–2047 లక్ష్యంగా చేపట్టిన జనగణన–2027 ప్రక్రియలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుంచి కలెక్టరేట్ వరకు నిర్వహించిన సెన్సస్ వాక్/మారథాన్తో పాటు అవగాహన ప్రచార రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పూర్తైన సెల్ఫ్ ఎన్యూమరేషన్ ప్రక్రియ ద్వారా సుమారు 12వేల కుటుంబాలు తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకున్నట్లు తెలిపారు. నేటి నుంచి జూన్ 9 వరకు నిర్వహించే తొలి దశ హౌస్ లిస్టింగ్, హౌసింగ్ సెన్సస్ అత్యంత కీలకమని పేర్కొన్నారు. జిల్లాలోని 1,293 బ్లాకుల్లో ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తారని తెలిపారు. క్షేత్రస్థాయిలో వచ్చే సిబ్బందికి ప్రజలు ఎలాంటి భయం లేకుండా సరైన సమాచారం అందించాలని, సేకరించిన వివరాలు డేటా ప్రైవసీ చట్టాల ప్రకారం పూర్తిగా గోప్యంగా ఉంటాయని స్పష్టం చేశారు. ఈ సమాచారం కేవలం ప్రభుత్వ అభివృద్ధి పథకాల రూపకల్పనకే ఉపయోగపడుతుందని చెప్పారు. ఎన్యూమరేటర్లు అడిగే 34 ప్రశ్నలకు యథార్థమైన సమాధానాలు ఇవ్వాలని, ఇప్పటికే సెల్ఫ్ ఎన్యూమరేషన్ పూర్తి చేసిన వారు తమ ఐడీ చూపిస్తే ప్రక్రియ మరింత వేగవంతం అవుతుందని అన్నారు. జిల్లా అధికారుల పర్యవేక్షణలో సాగుతున్న ఈ జాతీయ యజ్ఞంలో ఆదిలాబాద్ జిల్లాను ఆదర్శంగా నిలపాలని కోరారు. ఈ ర్యాలీలో అదనపు కలెక్టర్లు ఆర్ఎస్. చిత్రు, రాజేశ్వర్, డీఆర్ఓ స్రవంతి, డీవైఎస్ఓ శ్రీనివాస్, ఈడీ మనోహర్, మెప్మా పీడీ రాజు, పర్యవేక్షకురాలు నలంద ప్రియ, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు, ప్రజలు, యువత, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చదువుతోనే సమాజంలో గుర్తింపు




**ఆదిలాబాద్:** చదువుతోనే సమాజంలో గుర్తింపు, గౌరవం లభిస్తాయని ఆదిలాబాద్ మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన విద్యా వారోత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ అతీక్ బేగం, లెక్చరర్లతో కలిసి కొత్త విద్యా సంవత్సర ప్రవేశాలకు సంబంధించిన కరపత్రాలు, పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సంస్కారం, నైతిక విలువలను పెంపొందించుకోవాలని సూచించారు. కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని, జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొని ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో అన్నిరకాల మౌలిక వసతులు కల్పిస్తున్నారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నత చదువుల వైపు ప్రోత్సహించాలని, విద్యార్థుల అభివృద్ధికి తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని అన్నారు. అంతకుముందు కళాశాల యాజమాన్యం చైర్పర్సన్ అనూష సతీష్ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రఘు గణపతి, కోఆర్డినేటర్ ఎం.కోటయ్య, చంద్రకాంత్, ముబారక్, బండారి సతీష్, స్వప్న, అనిత, నరేష్, కునాల్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

చురకలు

మంగళవారం 12 మే 2026

# సంక్షేమ పాలనతో ప్రజల జీవితాల్లో వెలుగులు

- **ఇందిరమ్మ గృహప్రవేశాల్లో ఎమ్మెల్యే రాగమయి దయానంద్**



**సత్తుపల్లి:** సంక్షేమ పాలనతో ప్రభుత్వం ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిందని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ అన్నారు. మండలంలోని కాకర్లపల్లి గ్రామంలో సోమవారం నిర్వహించిన ఇందిరమ్మ గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ లబ్ధిదారులు కేలావత్ రవీంద్ర–గౌరీ దంపతుల నూతన గృహాన్ని సందర్శించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఆంబోజు నాగేశ్వరరావు–మమత దంపతుల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ దాదాపు 15 సంవత్సరాల నిరీక్షణ తర్వాత తెలంగాణ ప్రభుత్వం తమకు సొంత ఇళ్లు కల్పించిందని ఆనందం వ్యక్తం చేశారు. పేద ప్రజల జీవితాల్లో ఇందిరమ్మ ఇళ్ల పథకం కొత్త వెలుగులు నింపిందని పేర్కొన్నారు. అనంతరం కాకర్లపల్లి గ్రామానికి చెందిన మరికంటి శ్రీనివాసరావు–నాగలక్ష్మి దంపతుల కుమార్తె నిహారిక వివాహ వేడుకలో ఎమ్మెల్యే పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులకు ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తదుపరి గ్రామంలో పలు శుభకార్యాలు, పరామర్శ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ బొంతు సుమలత, మాజీ ఎంపీపీ చల్లారి వెంకటేశ్వరరావు, కిసాన్ అధ్యక్షులు కంచర్ల రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

- **కందుకూరులో జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో వేసవి శిక్షణ తరగతులు ప్రారంభం**




**సత్తుపల్లి:** విద్యార్థులు చదువుతో పాటు సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించుకోవాలని ఎంఈఓ చలంచర్ల వెంకటేశ్వరరావు అన్నారు. వేంసూరు మండలంలోని కందుకూరు గ్రామ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులను గ్రామ సర్పంచ్ మందపాటి వెంకటరెడ్డి, ఉప సర్పంచ్ గొర్ల ప్రభాకర్ రెడ్డిలతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే కంప్యూటర్ పరిజ్ఞానం అత్యంత కీలకమని అన్నారు. ప్రతి విద్యార్థి కంప్యూటర్ తరగతుల్లో చురుకుగా పాల్గొని అవగాహన పెంచుకోవాలని సూచించారు. విద్యతోనే సమాజంలో మంచి గుర్తింపు, గౌరవం ఉంటుందన్నారు. కందుకూరు పాఠశాలకు విద్యార్థులు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు క్రీడలు, కంప్యూటర్ ల్యాబ్ శిక్షణతో పాటు బాలికలకు కుట్టుమిషన్ శిక్షణ కూడా అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బొంతు శ్రీనివాసరావు, వార్డు సభ్యులు కిష్టా కొండా, బూరుగు కృపా, ఒగ్గు స్వాతి, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న ప్రభుత్వం

- **మొక్కజొన్న కొనుగోళ్లలో జాప్యంపై మాజీ ఎమ్మెల్యే సండ్ర ఆగ్రహం**



**సత్తుపల్లి:** మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతోందని, దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య మండిపడ్డారు. వేంసూరు మండలం మర్లపాడు, కల్లూరుగూడెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను సోమవారం సందర్శించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో రాజకీయ జోక్యం పెరిగి రైతులు నష్టపోతున్నారని ఆరోపించారు. గన్ని బ్యాగుల సరఫరాలో కూడా ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోళ్లు సక్రమంగా సాగక రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించి కొనుగోళ్లను వేగవంతం చేయాలని, కొనుగోలు కేంద్రాల్లో హమాలీ కూలీల సంఖ్యను పెంచి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కరోనా సమయంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతాంగాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి గింజను కొనుగోలు చేసి రైతులకు అండగా నిలిచారని గుర్తు చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలతో వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టుతోందని విమర్శించారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేయూలో మెగా జాబ్ మేళా




**వరంగల్:** ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక అభివృద్ధి 99 రోజుల కార్యక్రమంలో భాగంగా కాకతీయ విశ్వ విద్యాలయం విద్యార్థుల ఉపాధి అవకాశాల కల్పనకు మరో ముందడుగు వేసింది. మెగా జాబ్ డ్రైవ్ పోస్టర్లను సోమవారం కేయూ రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేయూ ప్లేస్మెంట్ సెల్ డైరెక్టర్, పాలక మండలి సభ్యులు డాక్టర్ చిర్ర రాజు గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులకు విస్తృతంగా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు విశ్వవిద్యాలయం కృషి చేస్తోందన్నారు. ఈ మెగా జాబ్ డ్రైవ్లో 24/7 జాబ్స్ కంపెనీ, టాటా ఎలక్ట్రానిక్స్, బజాజ్ ఫైనాన్స్, క్యూన్ కార్పొరేషన్ క్లైంట్స్ సహా దాదాపు 12 ప్రముఖ సంస్థలు పాల్గొంటున్నాయని తెలిపారు. ఏదైనా డిగ్రీ, బీటెక్ పూర్తి చేసిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జాబ్ మేళాలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. మంగళవారం ఉదయం 10 గంటలకు కేయూ క్యాంపస్లోని కామర్స్ సెమినార్ హాల్లో ఈ జాబ్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు వివరించారు. విద్యార్థులు తమ భవిష్యత్తుకు బాటలు వేసుకునేలా ఈ జాబ్ మేళా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కామర్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య నరసింహ చారి, కేయూ స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ ఆచార్య ఇస్తారీ, యూనివర్సిటీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ మమత, మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ప్రతినిధులు ఎల్.రాకేష్, పి.నందీశ్వర, శ్రీనివాస్, డాక్టర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలనలో క్రీడలకు ప్రాధాన్యం







**ములుగు:** ప్రజా పాలనలో ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యం ఇస్తుందని ములుగు జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి అన్నారు. రాష్ట్ర మంత్రి సీతక్క ఆదేశాల మేరకు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచనలతో 99 రోజుల ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ములుగు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి మెగా వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. తాడ్వాయి మండలం కామారం గ్రామంలో ఏర్పాటు చేసిన ఈ టోర్నమెంట్ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పోలీస్ శాఖ క్రీడా పోటీలను నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రీడల్లో పాల్గొని శారీరక, మానసిక ఉల్లాసాన్ని పొందాలని సూచించారు. తాడ్వాయి మండల యువతకు పోలీస్ శాఖ మంచి ప్రోత్సాహం అందిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ దయాకర్, ఎస్సై జగదీష్, గ్రామ సర్పంచ్ కోర్నిబెల్లి సావిత్రి, ఉప సర్పంచ్ రేగ అనిల్, క్రీడాకారులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమానికి పెద్దపీట వేయాలి

### మార్కెట్ కమిటీ చైర్మన్ కు ఘన సన్మానం



**ఆదిలాబాద్:** రైతుల సంక్షేమానికి పెద్దపీట వేయాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు నరేష్ జాదవ్ అన్నారు. ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్గా బాధ్యతలు స్వీకరించిన బోరంచు శ్రీకాంత్ రెడ్డి తోపాటు కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించారు. సోమవారం ఆదిలాబాద్లోని డీసీసీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నరేష్ జాదవ్ మాట్లాడుతూ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఆకాంక్షించారు. మార్కెట్ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తూ రైతులకు గిట్టుబాటు ధరలు అందేలా, మౌలిక సదుపాయాలు మెరుగుపడేలా కమిటీ చురుకుగా పనిచేయాలని సూచించారు. అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్ యార్డులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని, అన్నదాతలకు పారదర్శకమైన సేవలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భీమవరం వద్ద ట్రాక్టర్ ట్రక్కు బోల్తా

### ఘటన స్థలంలోనే యువకుడు మృతి



**సత్తుపల్లి:** వేంసూరు మండల పరిధిలోని భీమవరం వెళ్లే రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాయుడుపాలెం గ్రామానికి చెందిన విస్సంపల్లి మురళీకృష్ణ (30) భీమవరం నుంచి మర్లపాడు వైపు ట్రాక్టర్ ట్రక్కులో వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మార్గమధ్యంలో ఎదురుగా ఓ కారు వేగంగా రావడంతో మలుపు వద్ద దానిని తప్పించే ప్రయత్నంలో ట్రాక్టర్ ట్రక్కు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రక్కులో ప్రయాణిస్తున్న మురళీకృష్ణ అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు. ఘటనపై వేంసూరు ఏఎస్సై నాగేశ్వరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదం




**ఆదిలాబాద్:** వేసవి ఎండలు తీవ్రరూపం దాల్చుతున్న నేపథ్యంలో సామాన్యుల దాహార్తిని తీర్చేందుకు సమనుజ్ఞ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలోని ఠాకూర్ హోటల్ బస్టాండ్ వద్ద చలివేంద్రం ఏర్పాటు చేసి మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆర్టీసీ డీఎం ప్రతిమారెడ్డి, ప్రైవేట్ ఆర్టీసీ ఎయిర్బస్ ఓనర్ రాష్ట్ర కార్యదర్శి సురం తిరుపతి రెడ్డి, ట్రస్ట్ చైర్మన్ న్యాయవాది కె.విశ్వనాథ్ ప్రారంభించారు. అనంతరం బాటసారులు, ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ కె.విశ్వనాథ్ మాట్లాడుతూ మే నెలలో ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు వచ్చే ప్రజల సౌకర్యార్థం ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా రైల్వే స్టేషన్, బస్టాండ్ పరిసరాల్లో ప్రయాణికుల రద్దీ అధికంగా ఉంటుందని, వారికి తాగునీరు, మజ్జిగ అందుబాటులో ఉంచాలనే ఉద్దేశంతో కార్యక్రమాన్ని చేపట్టామని చెప్పారు. ప్రజలు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు సోనీ, కుర్మి వెంకట్ రమణ, మోతి సుధాకర్, గిరిబాబు యాదవ్, సయ్యద్ ముజఫర్, పసుపుల మణికంఠ ప్రసాద్తో పాటు స్థానిక ప్రజలు, సభ్యులు పాల్గొన్నారు.

## చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి




**తాండూర్:** వేసవి ఎండలు రోజురోజుకు తీవ్రరూపం దాల్చుతున్న నేపథ్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మంచిర్యాల జిల్లా డీసీసీ ఉపాధ్యక్షులు సూరం రవీందర్ రెడ్డి అన్నారు. సోమవారం తాండూర్ మండలం నీలయపల్లి గ్రామపంచాయతీ పరిధిలో సర్పంచ్ పోలవేణి తిరుపతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రయాణికులకు, గ్రామ ప్రజలకు తాగునీరు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలు, బాటసారులకు వేసవి కాలంలో తాగునీటి సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు ఈ సదుపాయాన్ని వినియోగించుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాపెల్లి సతీష్, మాదారం సర్పంచ్ కృష్ణపల్లి లక్ష్మణ్, ఉప సర్పంచ్ సూరం దామోదర్ రెడ్డి, నాయకులు పుట్ట శ్రీనివాస్, రమేష్, షేక్ మొమిన్ అలీ తదితరులు పాల్గొన్నారు.

## పేద కుటుంబానికి అండగా నిలిచిన గ్రామస్థులు



**నేరడిగొండ:** మండలంలోని రోల్మామడ గ్రామంలో మానవత్వం పరిమళించింది. గ్రామానికి చెందిన ఆత్రం రాధాబాయి–రాములు దంపతుల కుమారుడు సోనేరావు వివాహానికి ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్న విషయం తెలుసుకున్న గ్రామస్థులు తమవంతు సహాయంతో అండగా నిలిచారు. నిరుపేద కుటుంబానికి చెందిన సోనేరావు పెళ్లి ఖర్చుల కోసం గ్రామస్థులంతా కలిసి రూ.20వేల నగదును సేకరించారు. సోమవారం గ్రామ సర్పంచ్ తొడసం శంకర్, గ్రామ పెద్దల సమక్షంలో ఆ మొత్తాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ ఒకే గ్రామంలో కలిసి జీవిస్తున్న వారు కష్టాల్లో ఉన్నప్పుడు ఆదుకోవడం ప్రతిఒక్కరి బాధ్యత అని తెలిపారు. సోనేరావు వివాహం సంతోషంగా జరగాలని ఆకాంక్షిస్తూ ఈ చిన్నపాటి సహాయం చేశామని పేర్కొన్నారు. కష్టకాలంలో తమకు తోడుగా నిలిచిన గ్రామస్థులకు రాధాబాయి–రాములు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఎల్ ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారం కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు

**మంచిర్యాల:** ఎల్ ఆర్ఎస్ దరఖాస్తులు, రుసుము, చెల్లింపులపై రాయితీ, దరఖాస్తుల పరిష్కారం కోసం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం జూలై 31వ తేదీ వరకు ఎల్ ఆర్ఎస్ రుసుములు, చార్జీల చెల్లింపుపై 25 శాతం రాయికి అవకాశం కల్పించిందని, ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. దరఖాస్తుల పరిష్కారంపై ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ కార్యాలయ పనివేళలు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటుందని, దరఖాస్తుదారులు 08736–250501 నంబర్ లో సంప్రదించవచ్చని వివరించారు.

## విద్యా అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక




**గుడిహత్నూర్:** ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా విద్యా అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నట్లు గుడిహత్నూర్ సర్పంచ్ శ్రీమతి ఆడే శీల అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 7 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల అభివృద్ధి, విద్యా ప్రమాణాల పెంపుదల, విద్యార్థుల భవిష్యత్తు అవకాశాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈనెల 11 నుంచి మే 17 వరకు కొనసాగనున్న ఈ వారోత్సవాల్లో ప్రతిరోజు ప్రత్యేక అంశంపై కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నిఖిల్ లామ్దడే, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

# దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత

- **ఉచిత సహాయ ఉపకరణాలు పంపిణీ చేసిన కలెక్టర్ రాజర్షిషా**



**ఆదిలాబాద్:** దివ్యాంగుల సంక్షేమాభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ప్రజాపాలన–ప్రగతిప్రణాళిక విద్యా వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక డైట్ కళాశాల ఆవరణలో విద్యాశాఖ, సమగ్ర శిక్షా, ఎలింకో సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యాంగ చిన్నారులకు ఉచిత సహాయ ఉపకరణాల పంపిణీ శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సుమారు 250 మంది దివ్యాంగ చిన్నారులకు వారి అవసరాలకు అనుగుణంగా వివిధ రకాల సహాయక పరికరాలు పంపిణీ చేస్తున్నందుకు ఆనందంగా ఉందన్నారు. గతంలో నిర్వహించిన రిజిస్ట్రేషన్ల ద్వారా ఇప్పటికే సదరం సర్టిఫికేట్లు, పెన్షన్ సమస్యలను పరిష్కరించామని, ఇంకా పెన్షన్లు రాని అర్హులైన చిన్నారులకు త్వరలోనే మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. జిల్లా కేంద్రంలో దివ్యాంగ చిన్నారుల కోసం సుమారు రూ.2కోట్లతో ప్రత్యేక రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు కోసం సీఎస్ఆర్ నిధుల ద్వారా ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. చిన్నారుల భవిష్యత్తు కోసం వారిని క్రమం తప్పకుండా భవితా కేంద్రాలు, పాఠశాలలకు పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. పాఠశాలలకు హాజరుకాలేని పిల్లలకు హోమ్ బేస్డ్ ఎడ్యుకేషన్ అందిస్తామని, ప్రతి గురువారం వైద్యుల ద్వారా స్పీచ్ థెరపీ వంటి సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. సహాయక పరికరాలను వినియోగిస్తూ నిరంతరం అభ్యాసం చేస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. 18 ఏళ్లు నిండిన దివ్యాంగులు, వారి తల్లిదండ్రులకు కిరాణా దుకాణాలు, జిరాక్స్ సెంటర్లు వంటి చిన్న తరహా యూనిట్ల ఏర్పాటు కోసం ఆర్థిక పునరావాస పథకాల కింద సహాయం అందిస్తామని, అర్హులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అనంతరం కలెక్టర్ అధికారులతో కలిసి దివ్యాంగ చిన్నారులకు ఉపకరణాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, డీఈఓ రాజేశ్వర్, డిఆర్డీఓ రవీందర్ రాథోడ్, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, కోఆర్డినేటర్ తిరుపతి, ఎంఈఓ సోమయ్య, ఎలింకో ప్రతినిధులు రోహిణి, దివ్యాంగులు, వారి కుటుంబ సభ్యులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇండ్ల గణన ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలి

- **జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య సూచన**




**మంచిర్యాల:** జనగణన 2027లో భాగంగా నిర్వహిస్తున్న ఇండ్ల గణన కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య సూచించారు. సోమవారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కొనసాగుతున్న ఇండ్ల గణన ప్రక్రియను ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ అన్వేష్తో కలిసి సర్వే నిర్వహణ తీరును సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇండ్ల గణనను ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా నిబంధనలు పాటిస్తూ ఖచ్చితంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఎన్యుమరేటర్లు తమకు కేటాయించిన బ్లాక్లలో ఇంటింటికి వెళ్లి ప్రతి కుటుంబ వివరాలను జాగ్రత్తగా నమోదు చేయాలని, ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ పూర్తి వివరాలు సేకరించాలని ఆదేశించారు. సర్వే ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు నిరంతర పర్యవేక్షణ అవసరమని పేర్కొన్నారు. ఇండ్ల గణన భవిష్యత్ ప్రభుత్వ ప్రణాళికలు, సంక్షేమ పథకాల అమలులో కీలకపాత్ర పోషిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిటిసిపిఓ సంపత్, జనగణన అధికారులు హరిప్రసాద్, కృష్ణ, ఎన్యుమరేటర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.





# కొనుగోలు చేసిన ధాన్యాన్ని త్వరితగతిన తరలించాలి

**అదనపు కలెక్టర్ వి.రాములు**



**మంచిర్యాల:** జిల్లాలో రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేసిన ధాన్యాన్ని త్వరితగతిన కేటాయించిన రైస్ మిల్లులు, గోదాములకు తరలించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు సూచించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని అదనపు కలెక్టర్ ఛాంబర్లో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళలతో కలిసి ధాన్యం, గోనె సంచుల రవాణా గుత్తేదారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతుల నుంచి నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిబంధనలకు అనుగుణంగా కేటాయించిన రైస్ మిల్లులు, గోదాములకు తరలిస్తున్నామని చెప్పారు. ధాన్యం రవాణాకు అవసరమైన వాహనాలను సెక్టార్ 1, 2, 3, 4లకు సంబంధించిన గుత్తేదారులు సమకూర్చాలని ఆదేశించారు. రవాణా విషయంలో ఎలాంటి అంతరాయం లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆహార భద్రత విషయంలో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల:** జిల్లాలో ఆహార భద్రత విషయంలో ప్రతిఒక్కరూ నాణ్యత ప్రమాణాలు పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. సోమవారం నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో ఆహార భద్రతపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు, ఆహార సంబంధిత వ్యాపార, వాణిజ్య సంస్థల నుంచి ఆహార నమూనాలు సేకరించి నాణ్యత పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో విద్యార్థులకు అందించే ఆహార నాణ్యతను క్రమం తప్పకుండా పరిశీలించాలని సూచించారు. ఆహార సంబంధిత వ్యాపార సంస్థల్లో నిల్వ ఉంచిన ఆహార పదార్థాల కాలపరిమితి, నాణ్యతను తనిఖీ చేయడంతో పాటు సంబంధిత ధ్రువపత్రాలను పరిశీలించాలని తెలిపారు. సరైన పత్రాలు లేని సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాల పరిమితి ముగిసిన ఆహార పదార్థాలు లభిస్తే పూర్తి నివేదిక సమర్పించాలని, చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, జిల్లా విద్యాధికారి యాదయ్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేఖ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి అనిత, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా గెజిటెడ్ ఫుడ్ ఇన్స్పెక్టర్ వాసు రామ్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ మహేష్ పాల్గొన్నారు.

# ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ మ్యాపింగ్ పకడ్బందీగా చేపట్టాలి






- **రాష్ట్ర ముఖ్య ఎలక్టోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి**

**మంచిర్యాల:** ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా చేపట్టనున్న మ్యాపింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ముఖ్య ఎలక్టోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి సూచించారు. సోమవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులు, సహాయ ఎన్నికల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో త్వరలో చేపట్టే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా బూత్ స్థాయి అధికారులు, సూపర్వైజర్లు ప్రతి ఇంటిని సందర్శించి వివరాలు సేకరించాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారుల వివరాలను ప్రజలకు తెలిసేలా విస్తృత ప్రచారం చేయాలని అన్నారు. మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు స్వయం సహాయక సంఘాల సభ్యుల సహకారం తీసుకోవాలని, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో ఎప్పటికప్పుడు సమీక్ష సమావేశాలు నిర్వహించి వారి అనుమానాలను నివృత్తి చేయాలని ఆదేశించారు. పెండింగ్లో ఉన్న ఫారం-6, 7, 8 దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై చర్యలు చేపడుతున్నామని తెలిపారు. బూత్ స్థాయి అధికారులకు గుర్తింపు కార్డులు జారీ చేశామని, ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. ప్రతి ఓటరు జాబితాలో సక్రమంగా మ్యాపింగ్ అయ్యేలా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లతో సమన్వయం చేస్తూ స్పష్టమైన జాబితా రూపొందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పేదల భూములను లాక్కుంటే సహించేది లేదు

**డాక్టర్ ఆర్ఎస్. ప్రవీణ్ కుమార్**



**చింతలమానేపల్లి:** పోడు భూముల సమస్యపై "టైగర్ కారిడార్"పేరుతో అటవీ శాఖ అధికారులు పేద రైతుల భూములను బలవంతంగా స్వాధీనం చేసుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని డాక్టర్ ఆర్ఎస్. ప్రవీణ్ కుమార్ అన్నారు. సోమవారం సిర్పూర్ నియోజకవర్గంలోని కర్జవెల్లి, దిందా, కేతిని, బెజ్జూర్ తదితర గ్రామాల్లో పర్యటించిన ఆయన అటవీ అధికారుల వేధింపులకు గురవుతున్న బాధిత రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 60 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములను అటవీ అధికారులు రాత్రికి రాత్రే బుల్డోజర్లతో ధ్వంసం చేయడం దారుణమని మండిపడ్డారు. పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులపై తప్పుడు కేసులు నమోదు చేసి జైలుకు పంపడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ ఈ ప్రాంత మహిళల కష్టాలను పట్టించుకోలేదని ఆరోపించారు. ఉన్నతాధికారులు ఒకలా చెప్పి, క్షేత్రస్థాయిలో మరోలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. 7 పులుల కోసం 7లక్షల మందిని ఆకలితో చంపడం ఏ రకమైన పాలన.. అని ప్రశ్నించారు. స్థానిక బీజేపీ ఎమ్మెల్యే హరీష్ బాబు కూడా పేదల సమస్యలపై అసెంబ్లీలో గళం విప్పలేకపోయారని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే జీఓ 49ను రద్దు చేసి పేద రైతులకు భూములపై పూర్తి హక్కులు కల్పించాలని, పేదల భూముల్లో నాటిన మొక్కలను తొలగించి సాగుకు అనుమతించాలని, రైతులపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల సహనాన్ని పరీక్షించవద్దని, పరిస్థితి ఇలాగే కొనసాగితే ఉద్యమం తీవ్రరూపం దాలుస్తుందని హెచ్చరించారు.

# రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలి

- **మంత్రి కోమటిరెడ్డికి సోయం బాపురావు వినతి**



**ఆదిలాబాద్:** బోథ్ నియోజకవర్గంలోని పలు మండలాల్లో పెండింగ్లో ఉన్న రోడ్డు పనులను తక్షణమే పూర్తి చేయాలని, నూతన రోడ్డు నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని మాజీ ఎంపీ, రాజ్ గోండ్ సేవ సమితి రాష్ట్ర అధ్యక్షులు సోయం బాపురావు ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని కోరారు. సోమవారం హైదరాబాద్లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మాజీ డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజ రెడ్డితో కలిసి మంత్రికి వినతి పత్రం సమర్పించారు. భీంపూర్ మండలానికి సంబంధించిన పలు అభివృద్ధి సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నేషనల్ హైవే నుంచి అర్లి(టి) గ్రామం వరకు కొనసాగుతున్న రోడ్డు పనులకు సంబంధించి బకాయి ఉన్న రూ.9 కోట్ల నిధులను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే అర్లి(టి) నుంచి గుబిడిపల్లి వరకు పూర్తిగా దెబ్బతిన్న రహదారి నిర్మాణానికి రూ.25 కోట్ల నిధులు మంజూరు చేసి పనులు త్వరగా ప్రారంభించాలని కోరారు. తాంసి మండల కేంద్రం సవర్గంలో బీసీ భవనం, భీంపూర్ మండల కేంద్రంలో ఎస్టీ భవనం, అర్లి(టి) గ్రామంలో ఎస్సీ భవనం నిర్మాణాల కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని అభ్యర్థించారు. ఈ సమస్యలపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సానుకూలంగా స్పందించి, త్వరలోనే నిధులు విడుదల చేసి పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సోయం బాపురావు వివరించారు.

# ఘనంగా పిప్పల్ కోటి సర్పంచ్ జన్మదిన వేడుకలు



**భీంపూర్:** మండలంలోని పిప్పల్ కోటి గ్రామ సర్పంచ్ దాసరి రమేష్ జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, వైస్ చైర్మన్ తన్వీర్ అహ్మద్ పటేల్ ముఖ్య అతిథులుగా హాజరై సర్పంచ్ రమేష్కు పూలమాలలు వేసి, శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సేవలో సర్పంచ్ రమేష్ మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని, ఆయురారోగ్యాలతో ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. అనంతరం భారీ కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో తాంసి మాజీ ఎంపీపీ శ్రీధర్ రెడ్డి, అర్లి(టి) సర్పంచ్ కామన్ అశోక్, ఆత్మ చైర్మన్ కౌడాల నారాయణ, నాయకులు దండే సుదర్శన్, కె.దేవరెడ్డి, అక్షయ్, నరేష్ యాదవ్, అందర్బంద్ మాజీ సర్పంచ్ కృష్ణయాదవ్, గంగారెడ్డి, మతీన్ పటేల్, కిషన్, షేక్ అఫ్రోజ్, రేణికుంట్ల శ్రీనివాస్, కప్పర్ల సర్పంచ్ గంగ్రత్ అరుణ్, కొండాల సంతోష్, రేండ్ల గోవర్దన్ తదితరులు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి పరామర్శ



**తాండూర్:** తాండూర్ గ్రామానికి చెందిన గౌస్ ఖాన్ అనారోగ్యంతో శుక్రవారం హైదరాబాద్లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు సోమవారం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. గ్రామంలోని గౌస్ ఖాన్ నివాసానికి వెళ్లిన నాయకులు కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ క్లిష్ట సమయంలో బీఆర్ఎస్ పార్టీ కుటుంబానికి అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎలుక రామచందర్, దత్తు దొర, వినాయక్ రావు, మంజూర్ అలీ, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

# చేతిపంపు మరమ్మతుతో నీటి సమస్య పరిష్కారం



**హన్మకొండ:** వేసవిలో చేతిపంపు చెడిపోవడంతో గ్రామంలోని 12వ వార్డు కాలనీ వాసులకు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను గ్రామస్తులు సర్పంచ్ గరిగే కల్పన కృష్ణమూర్తి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సర్పంచ్ సోమవారం మరమ్మతు పనులను చేయించారు. ప్రజలకు నీటి సమస్య రాకుండా తక్షణమే మరమ్మతు పనులు పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు సర్పంచ్ తీసుకున్న చొరవను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు సభ్యుడు సదిరం వంశి, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# అతివేగంతో బైక్ను ఢీకొట్టిన కారు

**దంపతులకు తీవ్ర గాయాలు**



**గుడిహత్నూర్:** మండల పరిధిలోని సీతాగొంది సమీపంలో సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇచ్చోడ మండలం ముక్రా(కె) గ్రామానికి చెందిన కొడప సురేష్ తన భార్య లక్ష్మీబాయితో కలిసి ద్విచక్ర వాహనం(AP01H 7516)పై ఆదిలాబాద్ వైపు వెళ్తున్నారు. ఉదయం 11.30 గంటల సమయంలో సీతాగొంది గ్రామం దాటిన అనంతరం వెనుక నుంచి అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చిన కారు (AP25AC 9969) బైక్ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సురేష్, లక్ష్మీబాయి రోడ్డుపై పడిపోవడంతో తలకు, చేతులకు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్కు సమాచారం అందించగా, క్షతగాత్రులను జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. కారు డ్రైవర్ అశోక్ గాండ్లె నిర్లక్ష్యంగా వాహనం నడపడంతోనే ప్రమాదం జరిగిందని బాధితుడు సురేష్ గుడిహత్నూర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై శ్రీకాంత్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

